www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 డిసెంబర్ 2025

5

పశ్చిమ గోదావరి

విద్యార్థులకు చట్టాలపై అవగాహనుండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద అన్నారు. శుక్రవారం డిఎస్‌పి కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర విద్యార్థులకు చట్టాలు, పోలీస్ విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే దిశగా కృషిచేయాలన్నారు. ర్యాగింగ్, చెడు వ్యవసనాలు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐలు వాసు, నాగలక్ష్మిలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి

కొంచెం ఇష్టం కష్టం..!

- ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షల నిర్వహణలో మార్పులు చేసిన ప్రభుత్వం
- ఆరు పరీక్షలను ఐదు పరీక్షలుగా కుదింపు
- బోటనీ, బయాలజీ సబ్జెక్టులు కలిపి ఒకటే పరీక్ష
- విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే ప్రమాదం
- ఉత్తీర్ణతపై ప్రభావం పడుతుందంటున్న విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న ఇంటర్ పరీక్షల నిర్వహణ
- గందరగోళంలో ఇంటర్ విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం మార్పులు చేసింది. ఆరు పరీక్షలను ఐదు పరీక్షలుగా కుదించింది. బోటనీ, జువాలజీ కలిపి బయాలజీ పరీక్షగా మార్పు చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఏర్పడడమే కాకుండా ఉత్తీర్ణతపై తీవ్ర ప్రభావం పడుతుందని విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు గందరగోళ పరిస్థితిలో ఉన్నారు.

విద్యా విధానంలో కూటమి ప్రభుత్వం అనేక మార్పులు చేస్తోంది. దీనిలో భాగంగా ఇంటర్ ఫస్టియర్ ఎంపిసి, బైపిసి గ్రూపుల్లోని ఆరు పరీక్షలను ఐదింటికి కుదించింది. ఈ నేప థ్యంలో సబ్జెక్టుల మార్కులు మారాయి. ఎంపిసి మార్కులు మొత్తం 500, రాత పరీక్షలకు 470, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15-ఫిజిక్స్ 15) 30 మార్కులు ఇప్పటి వరకూ మ్యాథ్స్ సబ్జెక్టును రెండు పేపర్లుగా నిర్వహిస్తున్నారు. పేపర్ 1ఏకి 75 మార్కులు, పేపర్ 1బికి 75 మార్కులు మొత్తం 150 మార్కులతో పరీక్షలు జరిగేవి. ఇకపై 100 మార్కులతో ఒకే పేపరు నిర్వహిస్తారు. పాస్ మార్కులు 35, ఫిజిక్స్ 85, కెమిస్ట్రీ 85, ఫస్ట్, సెకండ్ లాంగ్వేజ్‌కు వంద మార్కుల చొప్పున రెండు పరీక్షా పత్రాలు ఇస్తారు. బైపిసిలో మార్కులు మొత్తం 500, రాత పరీక్షలకు 455, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15, ఫిజిక్స్ 15, బోటనీ, జువాలజీ 15) 55 మార్కులు. బోటనీ 60 మార్కులకు, జువాలజీ 60 మార్కులకు రెండు పేపర్లు ఉండేవి. ఇప్పుడు ఈ రెండు కలిపి 85 మార్కులుగా ఒకే ప్రశ్నాపత్రంగా ఇస్తారు. ఆన్సర్ షీట్లు మాత్రం రెండుగా ఉంటాయి. బోటనీ 43 మార్కులు, జువాలజీ 42 మార్కులుగా ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణత 29.5 మార్కులుగా నిర్ధారించారు. కానీ అర మార్కు ఉండదు. 29 మార్కులు వస్తే ఉత్తీర్ణతగా తీసుకుంటారు. ఫిజిక్స్ 85, కెమిస్ట్రీ 85 మార్కులకు ఉంటుంది. ఫస్ట్, సెకండ్ లాంగ్వే జెసు వంద మార్కుల చొప్పున పరీక్ష పత్రాలు ఇస్తారు. ఈ విధానంలో ఫస్టియర్ పరీక్షలు రాసిన విద్యార్థులు సెకండ్ ఇయర్లోనూ కొనసాగిస్తారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాత విధానంలోనే ప్రశ్నాపత్రాలు ఉంటాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 146 ఇంటర్ ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల నుంచి 19,703 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాయనున్నారు. వారిలో సోషల్ వెల్ఫేర్ ఒకటి నుంచి 110 మంది, ఒకేషనల్ 373 మంది, ఎయిడెడ్ 651 మంది, ప్రభుత్వ 1,625 మంది, ప్రయివేటు 16,647, హెచ్ఎస్ ప్లస్ నుంచి 297 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఏలూరు జిల్లాలో కూడా సుమారు 170 వరకూ ఇంటర్ ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలు ఉన్నాయి. ఇక్కడ కూడా దాదాపుగా 20 వేల మంది ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ కళాశాలలు, ప్లస్ 2 కళాశాలల్లోని విద్యార్థులకు ప్రశ్నాపత్రాలపై అవగాహన పెంచేందుకు ఓరియంటల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రాలు రూపకల్పన చేసి వాటి విధానాన్ని అవగాహన కల్పిస్తున్నారు. అయితే ఇప్పటికే ఇంటర్మీడియట్ పరీక్షల టైం టేబుల్ వచ్చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది విద్యార్థులు కొత్త సిలబస్ పరీక్షలకు హాజరుకానుండడంతో అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు వెనుకబడుతున్న అంశాల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఫిబ్రవరిలో జరిగే ప్రధాన పరీక్షల సమయానికి పరీక్షలపై భయం తొలగి, వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. అయితే ఈ ఆడది పరీక్షల నిర్వహణలో మార్పులు చోటు చేసుకోవడంతో విద్యార్థుల్లో పరిస్థితి ఏర్పడ్డాయి. బోటనీ, జువాలజీ కలిపి ఒకటే పరీక్షగా నిర్వహించడంతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పడనుంది. ఈ రెండు సబ్జెక్టులు కలిపి ఒకేసారి పరీక్ష పెట్టడంతో విద్యార్థులు ఆశించిన మేర సబ్జెక్ట్‌పై దృష్టి పెట్టే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రభావం పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కూటమి ప్రభుత్వ మాత్రం ఇంటర్ పరీక్షల్లో మార్పు అనేది విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో అవసరమని చెబుతోంది. అయితే పరీక్షలు ఏకాగ్రతతో రాయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం చేసిన మార్పులతో విద్యార్థులు గందరగోళానికి గురై పరీక్షలు ఆశించిన మేర రాసే పరిస్థితి కనిపించట్లేదు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం విద్యారంగానికి, విద్యార్థుల భవిష్యత్తుకు తగిన విధంగా నిర్ణయాలు తీసుకుంటేనే వారి భవిష్యత్తుకు పూల బాట వేసిన వారవుతారని విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

పిటిఎం విద్యార్థుల భవిష్యత్‌కు దిశా నిర్దేశం

- ఆర్థిక కారణాలతో చదువు కొనసాగించలేని వారికి సరస్వతీ విద్యా నిధి ద్వారా సహకారం
- కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం విద్యార్థుల భవిష్యత్‌కు చక్కని దిశా నిర్దేశమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం భీమవరం మండలం గూట్లపాడు గ్రామంలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం 3.0లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత మా తెలుగు తల్లికి మల్లెపూదండ ప్రార్థనాగీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.సత్యవాణి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సాధించిన ప్రగతి, ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ జిల్లా విద్యాశాఖ ప్రగతిని వివరించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లా అంతటా ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ఒక నిర్దేశిత లక్ష్యంతో పిటిఎం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమం విద్యార్థులకు ఒక దిశా నిర్దేశంగా దోహదపడుతుందని తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశాల ద్వారా పిల్లలు ఏ విధంగా చదువుకుంటున్నారు, ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తున్నారని తల్లిదండ్రులకు అవగాహన కలుగుతుందన్నారు. తద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. ముఖ్యంగా పిల్లలు స్కూలు నుండి వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటున్నారో తల్లిదండ్రులు గమనించాలన్నారు. పిల్లలు తల్లిదండ్రుల చెప్పిన మాట విని వారు చెప్పిన ప్రకారం నడుచుకోవాలన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తోందని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు తాహతకు మించి అప్పులు చేసి ప్రయివేటు పాఠశాలల్లో చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. జిల్లాలో తల్లికి వందనం పేరిట 1.76 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.220 కోట్లు జమ చేయడం జరిగిందని, ఈ పాఠశాలలో 290 మంది తల్లులకు రూ.43 లక్షల 53 వేల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగేలా పుస్తకాల్లో ఉండే పాఠాలు కాకుండా జీవితాన్ని చక్కగా కొనసాగించేందుకు చాగంటి కోటేశ్వరరావు రచించిన 'విలువల విద్య'ను కూడా అందిస్తున్నారని తెలిపారు. విలువలు విద్య పాఠ్యాంశంలోని పద్యాన్ని సందీప్ చరణ్ చక్కగా చెప్పాడన్నారు. ఇదే పాఠశాలలో విద్యనభ్యసించి ఐఐటి సీటు సాధించిన శ్రవణ్ కుమార్ గురించి, ఈ గ్రామం దగ్గరలోని దొంగపిండి గ్రామానికి చెందిన పూజ ఐఎఎస్‌కు సెలెక్ట్ కావడం ఎంతో గర్వించదగిన విషయమన్నారు. 'సరస్వతీ విద్యా నిధి' ఏర్పాటు చేస్తున్నామని సభా వేదిక నుంచి ప్రకటించారు. చదువులో రాణిస్తూ ఆర్థిక ఇబ్బందులతో చదువుకోలేని వారికి సరస్వతి విద్యానిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. తొలుత కలెక్టర్ నాగరాణి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుపై ముఖాముఖి మాట్లాడి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాలలోని కెమిస్ట్రీ ల్యాబ్ ను కలెక్టర్ సందర్శించారు. తల్లిదండ్రులకు ల్యాబ్‌ను చూపించి విద్యార్థులు చేసిన ప్రయోగాలను వివరించారు. అనంతరం కలెక్టర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి కింద కూర్చుని సహపంక్తి భోజనం చేసి అందరికీ స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ కె.రాంబాబు, వైస్ ఛైర్మన్ సాంబ, పంచాయతీ అధ్యక్షులు ఒ.మంగాచార్యులు, వైస్ ప్రెసిడెంట్ కొప్పర్తి సత్యనారాయణ, ఎంపిటిసి కె.పద్మజ, విద్యాశాఖ ఎడిఎం సత్యనారాయణ, ఎంఇఒ-1 ఎం.శ్రీనివాసరావు, ఎండిఎం కోఆర్డినేటర్లు జి.చిన్నయ్య, కృష్ణారావు, కోపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ బొమ్మిడి మధుసూదన్, మానవ హక్కుల కమిటీ మెంబర్ వీరవల్లి వెంకట సుబ్రహ్మణ్యం, దాతలు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

విఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఆంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించకపోతే మరోసారి పోరాటం తప్పదని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు అన్నారు. కలెక్టరేట్లో జిల్లా రెవెన్యూ అధికారి శివన్నారాయణ రెడ్డికి శుక్రవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గత కొన్నేళ్లగా విఆర్‌ఎలకు ఒక్క రూపాయి వేతనం పెంచలేదన్నారు. పెరుగుతున్న ధరలతో చాలీచాలని వేతనాలతో ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని చెప్పి 18 నెలలు కావస్తున్నా అమలుకు నోచుకోలేదని తెలిపారు. తండ్రి పనిచేయలేని పరిస్థితిలో ఉంటే కొడుకుతో పని చేయించుకుంటున్నారని, భార్య చేయలేని పరిస్థితిలో ఉంటే భర్తతో చేయించుకుంటున్నారని కనీసం మెడికల్ లీవ్ కూడా ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్న సందర్భాలు జిల్లాలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నామినీల పేరుతో సంవత్సరాలు తరబడి పనిచేస్తున్నా విఆర్‌ఎలుగా గుర్తించడానికి వచ్చిన ఇబ్బందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలు, కొంతమంది కంప్యూటర్ ఆపరేటర్లుగా, కారు డ్రైవర్లుగా, నైట్ వాచ్‌మెన్‌లు, అటెండర్లుగా చట్టవిరుద్ధంగా పనులు చేయించుకుంటున్నా జీతం పెంచడానికి మనసు రాకపోవడం దారుణమన్నారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎలు పాల్గొన్నారు.

డిఆర్ఒకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈనెల 6, 7 తేదీల్లో జరగబోయే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 47వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పతివాడ నాగేంద్రబాబు పిలుపునిచ్చారు. సంవత్సరానికి ఒకసారి జరిగే మహాసభ ఒక్కో సంవత్సరం ఒక్కో ప్రాంతంలో జరుగుతాయని, ఈ సంవత్సరం తాడేపల్లిగూడెం పట్టణంలో అపరాల ఆఫీసు చుక్కా అప్పలస్వామి భవనంలో జరుగుతాయని తెలిపారు. ఈ జిల్లా మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతాల నుండి ప్రతినిధులు హాజరవుతారని, 6వ తేదీ ఉదయం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ జరుగుతుందని, అనంతరం ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ మహాసభలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తాయి. తాడేపల్లిగూడెం మేధావులు, విద్యావేత్తలు, పెద్దలు జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పెదకాపవరంలో స్క్రబ్ టైఫస్..?

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో ఓ రైతుకు స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకినట్లు తెలిసింది. అయితే ఈ వ్యాధి పెదకాపవరంలోని పిహెచ్‌సి సమీపంలో నివాసం ఉంటున్న రైతుకు సోకినట్లు సమాచారం. అతనికి జ్వరం, జలుబు, ఒంటిపై దురదలు రావడంతో వేరే ఊరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో ఇటీవల రక్త పరీక్షలు చేయించుకున్నాడు. పాజిటివ్ ఫలితాలు రావడంతో శుక్రవారం పెదకాపవరంలోని పిహెచ్‌సికి వెళ్లి రిపోర్టును అక్కడి వైద్యులకు చూపినట్లు సమాచారం. అయితే దీనిపై పిహెచ్‌సి వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ రిపోర్టును ఉన్నత పరీక్షల నిమిత్తం పంపామని, ప్రస్తుతం వివరాలు తెలపలేమని తెలిపారు. వివరాలు తెలపటానికి మండల వైద్యాధికారి నిరాకరించారు.

పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

గంజాయి మూకలు గుండాలు దాడిచేసి హత్య చేసిన పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక మావుళ్లమ్మ గుడి రోడ్డులో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.బివాసుదేవరావు మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి నాయకులు, సిపిఎం కార్యకర్త పెంచలయ్య మరణం కళారంగానికి, యువతకు తీరని లోటు అని తెలిపారు. యువత వ్యసనాలకు బానిస అవుతున్నారని, గంజాయికి అలవాటు పడుతున్నారని తెలిపారు. పెంచలయ్య గ్రామ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని తెలిపారు. తన వ్యాపారానికి అడ్డు తగులుతున్న పెంచలయ్యను అడ్డు తొలగించుకోవాలని గుండాలు దాడి చేసి హతమార్చారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గంజాయి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గంజాయిపై ఉక్కు పాదం మోపి అరికట్టాలని, యువత భవిష్యత్తు కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిపిఎం నాయకులు డి.కళ్యాణి, ఎం.వైకుంఠరావు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, కురిటి సోమేశ్వరరావు, సంసోను పాల్గొన్నారు.

భీమవరంలో ధర్నా నిర్వహిస్తున్న నేతలు

నేలలోని సారాన్ని కాపాడాలి

పలుచోట్ల ప్రపంచ నేల దినోత్సవం

పెనుమంట్ర : ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

నేలలో ఉన్న సారాన్ని కోల్పోకుండా కాపాడవలసిన బాధ్యతను అందరూ నిర్వర్తించాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌ఛార్జి ఎడిఆర్ డాక్టర్ బి.సహదేవ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆచార్య ఎన్‌జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యాన వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులతో ప్రపంచ మృత్తిక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు నేలల విశిష్టతపై చిత్రలేఖన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఎడిఆర్ డాక్టర్ బి.సహదేవ రెడ్డి అధ్యక్షత వహించి ప్రపంచ నేలల దినోత్సవం ప్రాధాన్యత గురించి వివరిస్తూ నేలలను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను అందరూ తెలుసుకోవాలన్నారు. విచక్షణా రహితంగా ఎరువులు, ఇతర రసాయనాల వినియోగం వల్ల నేల, నీరు, పర్యావరణం కలుషితం కావడం జరుగుతుందని, కావునా వీటిని తగ్గించే దిశగా రైతులను సమాయత్తం చేయవలసిన ఆవశ్యకత శాస్త్రవేత్తలపై ఉందని తెలిపారు. అంతేకాక ప్లాస్టిక్ వ్యర్థాలు నేలలో నిక్షిప్తమై ఉండిపోవడం వల్ల వర్షపు నీరు సైతం నేలలోకి ఇంకిపోవడం వంటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయని తెలిపారు. తదుపరి ఇతర శాస్త్రవేత్తలు, విద్యార్థులు నేలల ఆరోగ్య పరిరక్షణ అవశ్యకత గురించి ప్రసంగించారు. అనంతరం మృత్తిక శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్, వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావుల ఆధ్వర్యాన నెగ్గిపూడి గ్రామంలో వ్యవసాయ పరిశోధనా స్థానం నుండి గ్రామ పంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రజలకు నేలల పరిరక్షణ ఆవశ్యకతను తెలిసేలా విద్యార్థులతో కలసి నినాదాలు చేశారు.

నరసాపురం: స్థానిక శ్రీవైఎన్ కళాశాల భూగోళ శాస్త్ర విభాగం, సామాజిక సేవా కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు మాట్లాడుతూ నేలల జీవ వైవిధ్యం వల్ల మనం పంటలు పండించి ఆహారాన్ని వృద్ధి చేసుకుంటున్నామన్నారు. చెట్ల ద్వారా ఆక్సిజన్ తీసుకుంటున్నామని, మన జీవన మనుగడకు నేలలు అత్యంత ప్రధాన పాత్ర పోషిస్తుందని, కాబట్టి మనం నేలలను సంరక్షించుకోవలసిన బాధ్యత భావితరాలపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెఎస్‌వి.రంగారావు, బెజవాడ వెంకటరత్నం, ఐక్యూ ఎసి సమన్వయకర్త ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, పరీక్షల నియంత్రణాధికారి కెసిఎస్‌వి.రమణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు చింతా సోమేశ్వరి, సాదే యాకోబు, భౌతికశాస్త్ర అధ్యాపకులు ఎల్.మల్లేశ్వరరావు, పరిమి రామకృష్ణ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : భూసారాన్ని పెంచేందుకు వ్యవసాయ రంగంలో ఆర్గానిక్ వినియోగంతో పాటు భవన నిర్మాణాల సమయంలో కూడా గ్రీనరీని అభివృద్ధి చేయాలని వ్యవసాయ శాఖ జెడిఎ జెడ్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వరల్డ్ సాయిల్ డే-2025ని పురస్కరించుకొని స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్, బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్‌తో ఎడ్యుకేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్వీనర్ డాక్టర్ కెఎం.గణేష్ అధ్యక్షత వహించారు. జెడిఎ జెడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూమిలో న్యూట్రన్స్ బాగా తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. భూసారాన్ని పెంచే విధంగా కృషి చేయాలని వివరించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ జి.శ్రీబాల, ఆర్అండ్‌డి డీన్ డాక్టర్ టి.వంశీ నాగరాజు పాల్గొన్నారు.

ఆకివీడు : దుంపగడప వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మృత్తికా దినోత్సవంపై విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ సహజ వనరులు, నేల నీరును ప్రాణప్రదంగా కాపాడుకోవాలన్నారు. రసాయనరహితంగా నేల పైపైగా దున్నుకుంటే ఒకటి నాలుగు పంటలు వేసుకోవచ్చు అని ఆమె తెలిపారు. సదస్సులో రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె.ఇందిర, టి.ఓగేశ్వరరావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం మట్టి వినియోగపు విధానాలను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు.

ఉండి : వ్యవసాయానికి వీలు కాని భూములను మాత్రమే రొయ్యల సాగుకు వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దెబోరా మెస్సియానా అన్నారు. శుక్రవారం ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు, విద్యార్థులకు నేలలు వాటి ఆవశ్యకత అనే అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవికె శాస్త్రవేత్తలు పలువురు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రొయ్యల సాగు విపరీతంగా పెరిగిపోయిందని, మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడకం పెరగడం వల్ల భూములు చౌడుబారి వాటి సాంద్రత కోల్పోతున్నాయని అన్నారు. అందువల్ల వ్యవసాయానికి అనువు కాని భూములను మాత్రమే రొయ్యల సాగుకు ఉపయోగించాలని కోరారు. కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ బిందు ప్రవీణ, కెవికె.సిబ్బంది, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు : దుంపగడప డిగ్రీ కళాశాలలో మృత్తిక ప్రదర్శన

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణ, మండలంలోని పలు ఎరువుల దుకాణాలతో పాటు సొసైటీ గొడౌన్‌లో శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ ఎడిఎ ప్రసాద్ జీవన్, ఎఒ జ్యోషిలా పలు రికార్డులు పరిశీలించారు. స్టాక్ వివరాలు, నిల్వలు, నోటీస్ బోర్డులను పరిశీలించారు. ఈ రెండు రోజుల్లో 17 దుకాణాల్లో తనిఖీలు చేశారు. నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలన్నారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తనిఖీలు చేపడుతున్న అధికారులు

ఆటస్థలం కేటాయించాలని నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలం కావాలని కోరుతూ శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. 1997లో యుపి స్కూల్‌గా ఉండేదని, అప్పట్లో పాఠశాలకు 5 ఎకరాల స్థలం ఉండేదన్నారు. జెడ్‌పి ఉన్నత పాఠశాల గా మార్చిన అనంతరం భూమి లేదని వారు ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలకు ఆటస్థలం లేకపోవడం దారుణమని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా రాణించాలంటే ఆట స్థలాన్ని వెంటనే కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవాకర్త నాగిడి రాంబాబు, పిటిఎం ఛైర్మన్ కొల్లాటి చూడామణి, దొంగ సాంబమూర్తి నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

రక్తపరీక్షలు చేయించుకోవటం వల్ల గ్రూపు వివరాలు తెలుసుకోవచ్చునని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. శుక్రవారం కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యాన విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలాకుమారి మాట్లాడుతూ గ్రూపు వివరాలు మన దగ్గర ఉంటే అత్యవసరమైన సమయంలో రక్తం అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఏడాదికి ఒకసారి రక్తదానం చేయటం మంచిదన్నారు. ఈ కార్యక్రంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, లెక్షరర్లు సిహెచ్.చైతన్య, రాజాబాబు, షేక్ మెయిన్ అన్సారీ, కె.పర్వీన్ వెంకన్నబాబు, కె.గణేష్ కుమార్, గన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యాన విజయ డయాగ్నస్టిక్ ల్యాబ్, పాలకొల్లు వారి సహకారంతో ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించి విద్యార్థుల్లో రక్తదానం పట్ల అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ వి.విజయలక్ష్మి పాల్గొన్నారు

దుప్పట్ల పంపిణీ అభినందనీయం

తహశీల్దార్ జి.సుందర్‌సింగ్

ప్రజాశక్తి - కాళ్ల

పాఠశాల విద్యార్థులకు శీతాకాలాన్ని పురస్కరించుకొని దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని కాళ్ల తహశీల్దార్ జి.సుందర్ సింగ్ అన్నారు. శుక్రవారం కాళ్ల మెయిన్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిఎస్ ప్రధానోపాధ్యాయులు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి.ఆరోగ్యస్వామి తల్లిదండ్రులు యోహాను- మేరీకాంతాబాయమ్మల జ్ఞాపకార్థం పాఠశాలలోని విద్యార్థులకు సుమారు రూ.18 వేలు విలువచేసే 60 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారావు సత్యశ్రీ, సుభాషిణి, బబిత, సిఆర్‌ఎంటి వెంకన్న బాబు, బందా పండు పాల్గొన్నారు.

మొక్కలు పెంచండి

లయన్స్ క్లబ్ నాయకులు మూర్తి

ప్రజాశక్తి - గణపవరం

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచవలసిన అవసరముందని గణపవరం లయన్స్ క్లబ్ కోశాధికారి కెఎస్.మూర్తి అన్నారు. లయన్స్ పిడి జి.కోటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సరిపల్లి రెండవ పాఠశాలలో కొబ్బరి ఉసిరి, సపోటా, మామిడి మొక్కలను నాటారు. అనంతరం అంగన్వాడీ పిల్లలకు భోజనం ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కిలారి రవిబాబు, వెల్లంకి నరేష్, జోన్ చైర్మన్ ఆర్.నాగరాజు, పాఠశాల హెచ్‌ఎం మద్దాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిసిపిఎం స్టేట్ ప్రెసిడెంట్ ఇస్మాయేల్

క్రైస్తవులపై వివక్ష తగదు

ఎపిసిపిఎం స్టేట్ ప్రెసిడెంట్ ఇస్మాయేల్

ప్రజాశక్తి - కాళ్ల

సమానత్వం గురించి బోధించే క్రైస్తవులపై వివక్ష సమాజంలో ప్రమాదకరమైన సంకేతాలను దారితీస్తుందని ఎపిసిపిఎం స్టేట్ ప్రెసిడెంట్ ఇస్మాయేల్ ఆందోళన వ్యక్తం చేశారు. బొండాడ గ్రామంలో శుక్రవారం కాళ్ల మండల ఎపిసిపిఎం పాస్టర్ల ఐక్య క్రిస్మస్ ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గేదెల జాను, ఎపిసిపిఎం స్టేట్ ప్రెసిడెంట్ ఇస్మాయేల్, పొలిటికల్ ప్రెసిడెంట్ రాజేష్ ఖన్నా, వైస్ ప్రెసిడెంట్ యోవేలు రాజు విచ్చేసి మాట్లాడారు. క్రిస్మస్ సందేశాలను రెవరెండ్ ఫిలిప్ రమేష్ బాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోకానికి పంచిన ప్రేమ, శాంతి, సమాధానం, సమానత్వం అనే విషయాలను ప్రబోధించారు. వివిధ గ్రామాల చెందిన పాస్టర్స్ పాల్గొన్నారు.

టిడిపి గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం టిడిపి పట్టణ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు వారి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ పెరుగుతున్న ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటిని తక్షణం పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు నుండి 740 వినతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, నరసాపురం ఎఎంసి చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, సంకు భాస్కర్ నాయుడు, కొప్పాడ రవి, మాలాల, కొలచన పద్మ, కోరాడ పాండురావు పాల్గొన్నారు.

బాలుడికి విద్యుత్ షాక్

తృటిలో తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక రైల్వే స్టేషన్ దగ్గరలో వాలీబాల్ ఆడుకుంటున్న బాలుడికి విద్యుత్ షాక్ తగిలి తృటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం స్టేషన్ పక్కన ఉన్న గ్రౌండ్లో వాలీబాల్ ఆడుకుంటుండగా బంతి గ్రౌండ్ బయట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కి ఆనుకుని పడింది. ఆడుకుంటున్న వారిలో ఒకడైన ఐదవ తరగతి చదువుతున్న నమ్మి హర్ష వెళ్లి బంతి తీసుకోబోతుండగా ట్రాన్స్‌ఫార్మర్ తగిలి విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే పడిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న స్థానికులు ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు బాలుడికి ప్రాణాపాయం తప్పింది.

'వికలాంగుల పట్ల వివక్ష చూపొద్దు'

ప్రజాశక్తి - ఉండి

సమాజంలో కొందరికి ఏదో ఒక అవయవ లోపం ఉండే వారిని వికలాంగులు అని పిలుస్తామని, లోపం శాపం కాదని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, రంగ ప్రసాద్ రాజులు అన్నారు. శుక్రవారం ఉండి భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవిత ఉపాధ్యాయులు తబిత, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విమల బాయమ్మ, ఉపాధ్యాయులు శివరామరాజు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంద్రధనస్సు పథకాలపై హర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

వికలాంగులకు 7 వరాలు ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలను మదర్ థెరిస్సా వికలాంగుల సంక్షేమ సంఘం నరసాపురం నియోజకవర్గం అధ్యక్షుడు విక్రాంత్ సాయి తెలిపారు. వారికి రుణపడి ఉంటామని మదర్ థెరిస్సా వికలాంగుల సంక్షేమ సంఘం సభ్యుల తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు మండలస్థాయి పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని ఎల్‌బిచర్ల జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో శనివారం ఉపాధ్యాయులకు మండలస్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్, పురుషులకు క్రికెట్ టీం సెలక్షన్ జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు ఉదయం 10 గంటలకు మైదానంలో ఉండాలని ఆమె కోరారు.

టీచర్లు, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

నరసాపురం: సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పిఎం శ్రీ ఐసిడిఎస్ అధ్వర్యంలో టీచర్లు, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్‌డిఒ దాసిరాజు, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి ఇంటర్వ్యూలు చేశారు. పెనుమంట్ర, మొగల్తూరు సెక్టార్ పరిధిలోని 52 ఆయా పోస్టులకు 128 మంది, రెండు టీచర్ పోస్టులకు 12 మంది హాజరయ్యారు. ఎంపికైన వారికి త్వరలో సమాచారం అందిస్తామని ఐసిడిఎస్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒలు ఊర్మిళ, కృష్ణకుమారి, ఉమా పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

ఇరగవరంలో..

చదువుతోపాటు ఆటల్లో భాగం కావాలి

జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి



కాళ్లలో కంప్యూటర్ ప్రింటర్‌ను అందజేస్తున్న దాత

వీరవాసరంలో..

ఆకివీడులో మాట్లాడుతున్న జెసి



మొగల్తూరులో..

పాలకొల్లులో..

ఆచంటలో..

పెనుగొండలో..

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మెగా పేరెంట్ - టీచర్ మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్కూల్ ఆవరణలో పరిసరాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒకచోట కూర్చోబెట్టి మాట్లాడారు. విద్యార్థులు విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు ఏమి చేస్తున్నారు? ఎలా చదువుతున్నారు? ఏ విషయంలోనైనా ఇబ్బంది పడుతున్నారా? ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మధ్య అభినవ సంబంధం ఉండాలని జెసి అన్నారు. అనంతరం విద్యార్థులు, పేరెంట్స్‌తో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిసి ఎం.శ్యాంసుందర్, ఎంఇఒ రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు పారానాయుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లా వెంకట్రావు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ బొర్రా వెంకటేశ్వరమ్మ, గ్రంథం ఉమా సత్యనారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

వీరవాసరం : విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మమేకమవ్వడం ద్వారానే విద్యార్థులలో లోపాలను గుర్తించవచ్చునని భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్‌డే కార్యక్రమంలో ఆర్‌డిఒ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎపి మహిళ సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత మాట్లాడుతూ ఎంఆర్‌కె హైస్కూల్‌లో విద్యనభ్యసించిన అనేక మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. అండలూరు, రాయకుదురు, కొణితివాడ, విఇసి జూనియర్ కళాశాల, చినపేట ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, వీరవాసరం సొసైటీ చైర్మన్ వీరవల్లి శ్రీనివాసరావు, సబ్బారపు వెంకట్రావు, ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్, ప్రిన్సిపల్ సిహెచ్‌వివి.రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణపవరం : విద్యార్థులు విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలని గణపవరం జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం కాలేజీలో జరిగిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో శ్రీనివాస్ గౌడ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి పథకాలు అందిస్తుందన్నారు. కాలేజీలో ఉన్న సమయంలో ఉపాధ్యాయులు బాధ్యతగా వారి విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఇంటిదగ్గర తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకుంటే వారు విద్యలో మరింత రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాళ్ల : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని దాతలు గోకరాజు నాగరాజు, గోకరాజు గణపతి రాజు అన్నారు. శుక్రవారం జువ్వలపాలెం గ్రామంలో గోకరాజు రంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ మెగా(పిటిఎం 3.0) సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా పలు రకాలైన సాంస్కృతిక, క్లాసిక్ నృత్య ప్రదర్శనలు జరిగాయి. ఆ తరువాత నూతనం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గోకరాజు గణపతిరాజు ప్రారంభించారు. దాత గోకరాజు గణపతిరాజు రూ.లక్ష ఆర్థికసాయంతో కంప్యూటర్, ప్రింటర్, యుపిఎస్, నిల్ కమల్ చైర్స్, స్పోర్ట్స్ మెటీరియల్ పాఠశాలకు అందజేశారు. టిడిపి కార్యకర్తలు మైక్రో(మైక్) సెట్, వెయిహింగ్ మెషిన్ స్కూల్‌కి బహూకరించారు. కంప్యూటర్, ప్రింటర్ ఇతర మెటీరియల్‌ను గ్రామ పెద్ద గోకరాజు లచ్చిరాజు ప్రారంభించారు. ఈ ఆత్మీయ మెగా సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం బి.రవి శంకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తే మానసిక వికాసం, శారీరక ధారుడ్యం లభిస్తుందన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నడింపల్లి విశ్వనాథరాజు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల తల్లిదండ్రులు తరచూ సందర్శించి మీ పిల్లల ప్రగతికి మీ సూచనలను అందజేయాలని కాళ్ల ఎంఇఒ-1 డి.శ్రీనివాసరావు కోరారు. వేంపాడు మోడల్ స్కూల్లో మెగా పిటిఎం 3.0 అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి యిర్రింకి పద్మావతి, ఎస్ఎంసి చైర్మన్ వీరమల్లు పద్మశ్రీ, స్పెషల్ ఆఫీసర్ పి.రాంబాబు(ఎఇ), డిప్యూటీ ఎంపిడిఒ తోట బాలకృష్ణ, పిఎస్ సెక్రటరీ ఎస్.వెంకటేష్, పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు.

పెనుమంట్ర : ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన అందించి, వెనుకబడిన విద్యార్థుల్లో సైతం మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని మెగా పిటిఎం స్పెషల్ ఆఫీసర్, మండల వ్యవసాయాధికారి బి.దేవీ స్వరూప కోరారు. మండలంలోని పొలమూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ 3.0 నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థి ప్రగతి నివేదికను చర్చించారు. అనంతరం క్రాఫ్ట్ అండ్ ఆర్ట్స్ పిఇటి నిర్వహించిన ఎగ్జిబిషన్ స్టాల్ తిలకించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాకర రాజేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆళ్ల రాము, ప్రధానోపాధ్యాయులు బిడిఎస్.సరస్వతి, సహకార సొసైటీ అధ్యక్షులు కండిబోయిన శ్రీనివాస్, నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ అలీ జిన్నా, మాజీ సర్పంచి, పాఠశాల పూర్వ విద్యార్థులు చింతపల్లి రామకృష్ణ, కేతా శ్రీనివాస్, చింతపల్లి సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ సభ్యులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

ఇరగవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థలో అనూహ్యమైన మార్పును తీసుకొచ్చి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని రేలంగి జెడ్‌పి హైస్కూల్‌లో జరిగిన మెగా పిటిఎంకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ పేరుతో ఉచిత కిట్‌లను అందిస్తుందన్నారు. తల్లికి వందనం పథకం పేరుతో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లులకు సంవత్సరానికి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కూటమి నాయకులు, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసు, మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ : తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి సానుకూలంగా, స్ఫూర్తిదాయకంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల పాఠశాల పెనుగొండ ప్రధానోపాధ్యాయురాలు సుభాని అధ్యక్షతన పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి తహశీల్దార్ అనిత కుమారి పాల్గొన్నారు. పిల్లలు చదువులో, ప్రవర్తనలో, సృజనాత్మకతలో ఎలా ఎదుగుతున్నారో ఉదాహరణలతో చెప్పడం తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంచింది. విద్యా కమిటీ చైర్మన్‌లు, మానవత సభ్యులు షేక్ మస్తాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మెగా పిటిఎం 3.0 సందర్భంగా స్థానిక ఎంపిపి మోడల్ పాఠశాలలో రూ.60 వేల విలువైన సౌకర్యాలను దాతలు ఏర్పాటు చేశారు. స్థానిక కూటమి నాయకులు, సీనియర్ టిడిపి నేత యర్రా రాధేగోపాల్ సుమారు రూ.50 వేలతో నిర్మించబడిన మంచినీటి టాప్, నీటి ట్యాంక్, వాస్ బేసిన్‌ను వార్డ్ మెంబర్ గంటా దుర్గా దేవి ప్రారంభించారు. కార్యక్రమంలో జవ్వాది నాగేశ్వరరావు వారి మాతృమూర్తి జ్ఞాపకార్థం పిల్లలందరికీ రూ.10 వేల విలువైన గ్లాసులు, కంచాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతల్ని అందరూ అభినందించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిటిఎం 3.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విద్యార్థుల ప్రగతిని వివరించారు. కేపీపాలెం సౌత్ గ్రామంలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పితాని ఇందిర అధ్యక్షత వహించి పాఠశాల ప్రగతి రిపోర్టుని సభలో వినిపించారు. ఈ సభకు వక్తగా ఉపాధ్యాయులు మట్టపర్తి విష్ణుమూర్తి పలు అంశాల గురించి వివరించారు. సర్పంచిలు కడలి కృష్ణమోహన్, అందే వెంకటలక్ష్మి ఉప సర్పంచి బెల్లపుకొండ వెంకట సూర్యనారాయణ(నాని), స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ బొక్కా ఇంద్ర, సత్తినేని త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆచంట : గురువులను దైవంగా భావించే సాంస్కృతి మనదని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. మండలంలోని అన్ని పాఠశాల్లో పిటిఎం 3.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరువురు మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో సమావేశాలు జరుపుకోవడం, ఇటు విద్యార్థులకు, అటు తల్లిదండ్రులకు ఉత్సాహాన్ని నింపాయన్నారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం విజయకేతనం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పితాని తనయుడు వెంకట్, పిడి పిచ్చయ్య, సిహెచ్.శ్రీనివాసరావు, పి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని పలు హైస్కూల్, స్కూళ్లలో మెగా పేరెంట్స్ సమావేశాలు జరిగాయి. పాఠశాలలు పరిశుభ్రత పాటిస్తూ, తోరణాలు అలంకరించి అందంగా తీర్చిదిద్దారు. పలుచోట్ల కూటమి నేతలు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. జివిఎస్‌విఆర్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్లో పిటిఎం 3.0 పిఎంసి చైర్మన్ కరణం పాపారావు ఆధ్వర్యంలో జరిగింది. పాఠశాలకు ముఖ్య అతిథులుగా ధనాని సూర్య ప్రకాష్, మజ్జి శంకరం హాజరయ్యారు. ఈ సందర్భంగా పేరెంట్స్ ఉద్దేశించి పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉండి: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని భవిష్యత్తులో ఆ లక్ష్యాన్ని అందుకునేందుకు కృషిచేయాలని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ పిటిఎంను హెచ్‌ఎం ఆధ్వర్యాన నిర్వహించారు. మహదేవపట్నం శివారు ఉత్తరపాలెం పాఠశాలలో హెచ్‌ఎం పిఎస్ఎన్.రాజు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో జుత్తిగ నాగరాజు పాల్గొని మాట్లాడారు. ఉండి గోరింతోట పాఠశాలలో హెచ్‌ఎం సిహెచ్.కాంతమ్మ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో చిట్టూరి ఇందిర జ్ఞాపకార్థం ఆమె భర్త సామ్సన్ విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందజేశారు.

నరసాపురం: పట్టణ, మండలంలో ప్రభుత్వ స్కూల్స్, గురుకుల పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ డే పండుగ వాతావరణంలో జరిగింది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆత్మీయ సమ్మేళానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందించారు. పట్టణంలోని బిసి గురుకుల పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. లెనిన్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. సర్పంచి వైఎస్.నాగ ముత్యమాంబ, ఎంఇఒ పుష్పరాజ్యం, ఎఎంసి మాజీ ఉపాధ్యక్షులు వైఎస్ బాబులు, వాసు, హెచ్‌ఎం కె.శ్రీనివాస్ ఉన్నారు.



గణపవరంలో..

పెనుమంట్రలో..

నరసాపురంలో..

వైరల్ జ్వరాల పట్ల శ్రద్ధ వహించండి

సబ్ యూనిట్ అధికారి ఎఎస్ఎస్ఎన్.మూర్తి

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్కరూ వైరల్ జ్వరాల పట్ల శ్రద్ధ వహించాలని సబ్ యూనిట్ అధికారి ఎఎస్ఎస్ఎన్.మూర్తి, డిప్యూటీ ఎంపిడిఒ సిఎస్‌వి.రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పులూరు గ్రామంలో గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని సభ దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ సిఎస్‌వి.రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఎఎస్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ గ్రామంలో ఖాళీ ప్రదేశాలు బాగా ఎక్కువగా ఉన్నాయని, దీని వల్ల గ్రామ ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను, టైర్లను ఆయా ప్రాంతాల్లో వదిలేయడంతో దోమలు ఆవాసం ఏర్పరచుకుని లార్వా ఏర్పడడంతో వైరస్ వ్యాప్తికి కారణమవుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, గ్రామంలోనే మరొక పది రోజుల వరకు మెడికల్ క్యాంప్ ఉంటుందని, అదేవిధంగా ఉదయం, సాయంత్రం ఫాగింగ్, బ్లీచింగ్ చల్లించి పారిశుధ్య సమస్య నివారించేందుకు పంచాయతీ అధికారులు, మెడికల్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. అదేవిధంగా రైతులు దిత్వా తుపాను నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన సలహాలను, సూచనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నిమ్మల కేశవ కుమార్, టిడిపి గ్రామ అధ్యక్షులు లోకం సుబ్బారావు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు పూర్తి సహకారం అందించాలి

దర్శిపర్రు సొసైటీ ప్రమాణ స్వీకారంలో ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - పెంటపాడు

రాష్ట్రానికి అన్నం పెట్టే రైతన్నలకు సహాయ సహకారాలు అనందించేందుకే సొసైటీల ఏర్పాటు జరిగిందని, అలాంటి సహకార సంఘం చైర్మన్‌గా పదవి పొందిన వారు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించి వ్యవసాయానికి కావలసిన అవసరాలు తీర్చే ఒక కర్మాగారంలా సొసైటీలు మార్చాలని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం పెంటపాడు మండలం దర్శిపర్రు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పాలూరి భూపాల్, సభ్యులుగా పాలూరి సత్యనారాయణ, పాలూరి వెంకట్రావుతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైతులకు సమస్య ఏదైనా వచ్చిందంటే అది తన సమస్యగా భావిస్తానని, అదే మాదిరిగా భూములు ఆన్‌లైన్ చూపించడం లేదని దర్శిపర్రు రైతులు తనకు చెప్పిన వెంటనే రాష్ట్ర కమిషనర్ వరకు ఈ సమస్య తీసుకెళ్లానన్నారు. ఈ సమస్య పరిష్కరించడానికి కృషిచేసిన సర్వే బృందానికి కలెక్టర్, విఆర్‌ఒ, తహశీల్దార్ అందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన మండల అధ్యక్షుడు పుల్ల బాబి, కిలపర్తి వెంకటరావు, కోడే కాళీ, కోలా మార్కండేయులు, వాడపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ గ్రీవెన్స్ డే నిర్వహించాలి

డిఆర్‌ఒని కోరిన ఎపి ఉద్యోగ సంఘం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎపిజిఇఎ తరఫున జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డిని జిల్లా అధ్యక్షులు వై.మోహనరావు, జిల్లా కార్యదర్శి జి.జకరయ్య, భీమవరం తాలూకా యూనిట్ ఉపాధ్యక్షులు వై.సురేష్ కలిసి ప్రతి నెలా 3వ శుక్రవారం ఎంప్లాయీస్ గ్రీవెన్స్ డే నిర్వహించాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం సభ్య సంఘాలతో నిర్వహించాలని ఆయన్ని కోరినట్లు తెలిపారు.

వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం



పరీక్షిస్తున్న వైద్యులు

దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంఎల్‌ఎలు కొత్తపల్లి జానకీరామ్, బండారు మాధవ నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మహిళా సంఘ భవనంలో రాయల్ వశిష్ట క్లబ్ అధ్యక్షులు జక్కం బాబ్జి, క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆక్యుపంచర్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రముఖ వైద్యులు, రాయల్ క్లబ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చినుమిల్లి సత్యనారాయణరావు ప్రారంభించి మాట్లాడారు. సేవా దృక్పథం కలిగిన బాబ్జి సమాజంలోని పేదలు, సంఘీయుల అభ్యున్నతి కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఈయన సేవలు అభినందనీయమన్నారు. ప్రముఖ మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ సిరిగినీడి రాజ్యలక్ష్మి, ఆక్యుపంచర్ వైద్యురాలు అరుంధతి మాట్లాడుతూ ఆక్యుపంచర్ వైద్యం విశిష్టతను వివరించారు. భవిష్యత్తులో జక్కం బాబ్జి ఆధ్వర్యాన మరిన్ని సేవా కార్యక్రమాలు జరగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాయల్ వశిష్ట క్లబ్ కార్యదర్శి పులి భుజంగారావు, కోశాధికారి దేవిరెడ్డి ధర్మారావు, నాయకులు అందే కృష్ణ, కోపల్లి శ్రీనివాస్, ఆరేటి మృత్యుంజయ, పులపర్తి కుమార్ రాజా, కాపు వనిత క్లబ్ అధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి భరణి, కొండవీటి రత్తయ్య, నరసింహమూర్తి, మురళీ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో స్వర్ణాంధ్ర విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్‌టిఆర్ జిల్లా మైలవరంలోని లక్కిరెడ్డి, బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కాకినాడ జెఎన్‌టియు సెంట్రల్ జోన్ వాలీబాల్ పోటీల్లో సీతారాంపురం సౌత్లోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిలో పి.భాస్కర్, ఎం.సూర్యప్రకాశ్, కె.ఆషిశ్, పి.రోషన్, జె.ప్రవీణ్, కె.భాను, ఎస్‌పిపికెహెచ్‌ఎఆర్.రాజు, వై.ప్రమోద్ కుమార్, వై.వరుణ్‌కుమార్, సిహెచ్.రాహుల్, డి.సూర్యతేజ, పి.రాజేశ్ ఉన్నారు. కాగా ఈనెల 10 నుంచి 14 వరకు కాకినాడ జెఎన్‌టియు యూనివర్సిటీలో జరిగే వాలీబాల్ పోటీల్లో కళాశాల విద్యార్థులు పి.రోషన్, ఎం.సూర్య ప్రకాశ్ ఎంపికయ్యారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కెవి.స్వామి, పాలకవర్గ సభ్యుడు అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేశ్ కుమార్, వైస్-ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపీచంద్, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

ప్రజాదర్బార్‌లో ఎంఎల్‌ఎ బొలిశెట్టి

పెంటపాడు: తన గెలుపు కోసం కృషిచేసిన ప్రతి ఒక్కరికీ తాను రుణపడి ఉంటానని, ఆ రుణాన్ని ప్రజాసమస్యల పరిష్కారం ద్వారా కొంత వరకు తీర్చుకోగలనని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని దర్శిపరు ప్రజాదర్బార్ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ప్రజలతో మమేకమయ్యారు. పుల్ల బాబి, కిలపర్తి వెంకటరావు, కోడే కాళీ, కోలా మార్కండేయులు, వాడపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

IN THE COURT OF 1st ADDITIONAL DISTRICT JUDGE, ELURU

E.P.NO.95/2024, O.S.NO.3/2016

Between:
Alla Venkata Narasimha Rao ...Decree-Holder
And
Prasadapu Venkateswara Rao And others ...Judgement-Debtors

AUCTION PUBLICATION

WHERE AS the DHR obtairned decree against the JDRS above named and the property of JDRs brought the below mentioned EP schedule property to sale in the above Execution petition.
WHERE AS the Honourable 1st ADDITIONAL DISTRICT JUDGE COURT, ELURU fixed the date on 22-12-2025 for the sale of the schedule property by public auction in the court, by ordering publication of the sale for notice to the intending bidders in order to participate in the auction. TAKE NOTICE that the persons who intended to participate in the auction for purchase of the schedule mentioned property can appear before the Honurable ourt on 22-12-2025 at 10-30 A.M on words and participate in auction.

SCHEDULE

Item No.1: West Godavari District,[Now Eluru District] Eluru Sub-Registry. Eluru City an extent of 219-4-0 Square yards of site equal to 183-447 Sq.mts. situated in R.S.Nos. 77/4, 77/5 equal to T.S.Nos.77/4,77/5 of Phiranguladibba, Muncipal 1/WP ward, Santhinagar, 9 Road, Eluru which is bounded by as follows:
East: Item No.2 joint passage site 50Ft
South: Site of Chinni Lakshmi Tulasi 39Ft
West: Property in S.No.77/1 50 Ft
North: Property in S.No.77/3 40 Ft
Within the said boundaries an extent of Ac.219-4-0 Square yards of Vacant site.
Item NO.2:
Joint passage site on the eastern side of item No. I an extent of 111-1-0 sq. yards situated in R.S.No.77/4,77/5 equal to T.S.Nos.77/4, 77/5 of Phiranguladibba, Santhi Nagar, 9th Road, Eluru which is bounded by as follows:
East: M.Koteswara Rao's Site to some Extent, K.M. Raghunadh and others site to some extent 100 Ft
South: Municipal Road 10Ft
West: Item No, 1 to some extent Ch. Lakshmi Tulasi to some extent 100ft
North: Site in R.S.No.77 /3 10Ft
Within the above boundaries an extent of 111-1-0 sq.yards of site out of which 29-0-0 sq.yards of undivided joint site which is meant for only passage.
D.H.R. VALUE Rs. 30,00,000/-
Amine Value Rs. 49,50,000/-
(As per court orders)

DEVULAPALLI SREE RAM
DEVULAPALLI KRISHNA SASTRY
Dt.23.11.2025. Advocates, Eluru